క్లుప్తంగా

త్వరలో మాస్టర్ ప్లాన్ అమలు


మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మున్సిపాలిటి పరిధిలో మాస్టర్ ప్లాన్ ప్రణాళిక అమలు చేయడం జరుగుతుందని మున్సిపల్‌కమీషనర్ శేషఫణి పేర్కొన్నారు.సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారి రమణారెడ్డితో కలిసి మాస్టర్ ప్లాన్‌పై చర్చ నిర్వహించారు. ఈ సందర్బంగా మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ మాస్టర్ ఫ్లాన్ అమలైతే ఎర్రగుంట్ల పట్టణం చుట్టూ బైపాస్‌రోడ్డు నిర్మాణం మున్సిపాలిటి పరిధిలో రోడ్ల నిర్మాణం మౌళిక సదుపాయాల కల్పన పెరుగుతుందన్నారు. తద్వార పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని ఉన్న అమలు కాలేదని ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ అమలుపై చర్చలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్లాన్ అమలు అయితే ఎర్రగుంట్ల రూపురేఖలు మారిపోతాయన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా గంగాదేవి


బాధ్యతలు స్వీకరిస్తున్న గంగాదేవి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా గంగాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌మోహన్‌రావు శిక్షణ నిమిత్తం 30 రోజుల పాటు శ్రీకాళహస్తికి వెళ్లారు. దీంతో జిల్లా పరిషత్ సీఈఓ ఉత్తర్వుల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పని చేస్తున్న గంగాదేవిని ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా గంగాదేవి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నివాళి


మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన చెర్లోపల్లె ఎంపీటీసీ ఆదిమూలం క్రిష్టయ్య(75) సోమవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

న్యాయం చేయాలి


ఆర్డీఓ కార్యాలయం వద్ద వెంకటరమణ

జమ్మలమడుగు : తనకు న్యాయం చేయాలంటూ మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన వికలాంగుడు వెంకటరమణ అధికారుల ముందు తన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అన్న శ్రీనివాసులు తన తండ్రి సంపాదించిన 8 ఎకరాల భూమి తానే అనుభవిస్తూ తనకు ఎలాంటి సంబంధంలేదంటూ గ్రామంలోనికి రాకుండ అడ్డుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండ గతంలో హౌసింగ్ సైతం తల్లిదండ్రులతో కలిసి ఉన్నప్పుడు తమ పేరు మీద ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. ఇంటిల్లో తమకు భాగంలేదని నీకు దిక్కు ఉన్నచోట చెప్పుకోపో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వికలాంగుడి కావడం ద్వార తనకు పెండ్లి జరుగుకుండ ఎన్నో అడ్డుకుటు సృష్టించారని అయితే తాను మరో వికలాంగురాలిని వివాహం చేసుకోవడం జరిగింది.అప్పటి నుంచి తనకు తండ్రి ఆస్థిలో ఎటువంటి సంబంధంలేదని ఇది తన స్వార్జితం అంటూ ఇక్కడికి ఆస్తి కావాలని అడిగితే గ్రామంలో అడుగుపెట్టలేవంటూ ఇబ్బందులు పెడుతున్నాడు. గ్రామంలో పంచాయతి పెట్టించిన తన మాట ఎవరు పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలంటూ కోరారు.

రేపు మండల సమావేశం

చక్రాయపేట : మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరుగనున్నట్లు ఎంపీడీవో కుళ్లాయమ్మ తెలిపారు.ఎంపీపీ మాధవి బాలకృష్ణ అధ్యక్షతన ఈసమావేశం మండల పరిషత్ సభాభవనంలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 10–30 గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశానికి మండలంలోని జడ్పీటీసీ,ఎంపీటీసీ సభ్యులు,సర్పంచులు,అన్నిశాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


వేంపల్లె : ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి


జమ్మలమడుగు రూరల్ : ప్రత్యేక అలంకరణలో నాగుల విగ్రహాలు


చింతకొమ్మదిన్నె : నాగులపుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : నాగుల చవితి పురస్కరించుకుని సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకొన్నారు. మహిళలు తెల్లవారుజామునే లేచి తలంటు స్నానాలు ఆచరించి నాగులపుట్ట, నాగుటకట్ట వద్దకు వెళ్లి నువ్వుల పిండి, చలివిడి పిండి, పెసరపప్పులను నైవేద్యంగా సమర్పించి నోము చీరను పుట్టపై ఉంచి చల్లంగ రూడు నాగరాజా అని వేడుకున్నారు. పుట్టలో పాలు పోసి పుట్ట చుట్టూ నూలు ధారం చుట్టి ప్రదక్షిణలు చేసి ఉపవాస దీక్షలు చేపట్టారు. కాయ కర్పూరాలు సమర్పించి తమ మనసులోని కోరికలను వేడుకున్నారు. పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి ఆలయం, బ్రాహ్మణపల్లె రోడ్డులోని నాగులకట్ట, తూర్పు ఆంజనేయస్వామి, పీడబ్ల్యూకాలనీ ఆంజనేయ స్వామి ఆలయం, పార్నపల్లెరోడ్డు సాయిబాబా ఆలయం, రాణితోపు సమీపంలో ఉన్న నాగుల పుట్టల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నాగపంచమి సందర్భంగా ఉపవాస దీక్ష ఉన్న మహిళలు పుట్టకు పాలు పోసి అందులో కొబ్బెర, బెల్లం ఉంచి ఉపవాస దీక్ష విరమిస్తారు.

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లోని పుట్టల వద్దకు మహిళలు వెళ్లి పూజలు నిర్వహించి ఉపవాస దీక్షలు ప్రారంభించారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె, కొత్తపల్లె, ఎర్రబల్లె, అచ్చివెళ్లి, ఎర్రబల్లె, తుమ్మలపల్లె తదితర గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు జరుపుకున్నారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పండుగ జరుపుకున్నారు. నాగుల చవితి పండుగను పురస్కరించుకుని మహిళలు పెద్ద ఎత్తున ఉపవాస దీక్షలతో పుట్టలకు పాలు పోసి నాగ దేవతలకు ఇష్టమైన చలిమి పిండి నైవేద్యం పెట్టి పుట్టకు దీపాలు వెలిగించి ప్రదర్శనలు నిర్వహించారు. ఇలా చేయడంవలన సర్పదోషాలు తొలగిపోతాయని కోరికలు నెరవేరుతాయని శుభాలు జరుగుతాయని భక్తుల విశ్వసిస్తారు.

వేంపల్లె : వేంపల్లె మండలం వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు వేకువ జామునే తలంటు స్నానం చేసి నాగుల పుట్ట వద్ద పూజలు చేశారు. స్థానిక గాండ్లవీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగుల పుట్ట వద్దకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు శేషగిరిరావు సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు రావడంతో ఆలయమంతా కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు సాంబశివుడు, సుబ్బారెడ్డి, ఆకేటి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

లింగాల : లింగాల మండలంలో నాగుల చవితి వేడుకలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస దీక్షలతో నాగ ప్రతిమలకు, పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని గ్రామాలలో మహిళలు ఉపవాస దీక్షలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ముద్దనూరు: నాగులచవితి పర్వదిన వేడుకలను భక్తి శ్రద్ధలతో భక్తులు జరుపుకున్నారు. భక్తులు ఉదయమే నాగదేవతకు ప్రత్యేక పూజలుచేసారు.నాగులుకు ప్రీతికరమైన నువ్వుల పిండి, పెసరపప్పులను నైవేద్యంగా పెట్టి పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక శివాలయం వద్ద,బ్రహ్మంగారి మఠంలోని పుట్టలకు అధిక సంఖ్యలో భక్తులు పూజలుచేసారు.

వల్లూరు: మండలంలోని పలు గ్రామాలలో భక్తులు సోమవారం నాగుల చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్బంగా నాగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయాలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలను జరుపుకున్నారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలంటూ మొక్కుకున్నారు. మరి కొన్ని చోట్ల మహిళలు పుట్టల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు.

కమలాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు నాగుల చవితి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సోమవారం నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కమలాపురం, కె.అప్పాయపల్లె, గంగవరం, సంబటూరు, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, కోగటం తదితర గ్రామాలలో వెలసిన ఉన్న పుట్టల వద్దకు నాగుల చీరలు ధరించిన మహిళలు వెళ్లి పుట్ట చుట్టూ దారం చుట్టి, పసుపు రాసి, పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం మహిళలు నాగులచవితిని పురస్కరించుకొని నాగుల పుట్టల వద్దకు వెళ్లి,నాగుల విగ్రహాలను ప్రతేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు ఈ పండుగ నాడు భక్తి శ్రద్ధలతో ప్రత్యేకంగా ఉపవాసాలు ఉండటం పరిపాటి.

జమ్మలమడుగు రూరల్ : నాగులచవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచే భక్తులు పుణ్యస్నానం అచరించి కుటుంబసభ్యులతో కలసి నాగులపుట్టకు వెళ్లి తమ మొక్కుబడులను చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి ఆలయం సమీపాన ఉన్న నాగులపుట్ట వద్దకు ఆశేషంగా భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

కృత్రిమ మేధస్సు పోటీల్లో ప్రతిభ


కృతిమ మేధస్సు ఆధారిత పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులు

వేంపల్లె : జాతీయ స్థాయిలో జరిగిన కృత్రిమ మేధస్సు ఆధారిత పోటీల్లో సంసిద్ధ్ సతీష్ రెడ్డి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపినట్లు అ పాఠశాల ప్రిన్సిపాల్ పరిమళాదేవి పేర్కొన్నారు. చెన్నైలోని ఐఐటీ రీసెర్చ్ పార్కులో ఎవాల్వ్ సంస్థ మే నెలలో కృత్రిమ మేధస్సు ఆధారిత పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహించారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 35 పాఠశాలలు పైగా సిబిఎస్ఇ పాఠశాలల నుండి 14వేల మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారన్నారు. దీంతో వేంపల్లెకు చెందిన సంసిద్ధ్ సతీష్ రెడ్డి పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థులు పోటిలకు హాజరు కాగా, 7వ తరగతికి చెందిన వెన్నిలా గ్రేస్ అనే విద్యార్థిని మూడవ బహుమతిని సాధించిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా ప్రాజెక్టులను తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రూపొందించారని, దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ పాఠశాలల కోసం చెన్నైలో పోటీలు నిర్వహించారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు భవిష్యత్తు సమస్యలకు పరిష్కారాల మార్గంపై ఎ-1 పరిజ్ఞానంతో రూపొందించారన్నారు. అందుకు గాను తమ పాఠశాల విద్యార్థులకు అవార్డులు అందుకున్నారని, తమ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో 7 మంది విద్యార్థులు కొత్త ఆలోచనలు, నూతన ప్రదర్శనలకు సంబంధించి జాతీయ స్థాయిలో ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు.

ఆశా నిలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

చింతకొమ్మదిన్నె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు సోమవారం చింతకొమ్మదిన్నె మండలంలోని ఆశా నిలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత ఆశా నిలయాన్ని ఆయన పరిశీలించారు. పరిసరాలను, జీవన పరిస్థితులు,భద్రత,ఆరోగ్యం,పరిశుభ్రత,ఆహారం, మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్య విలువైనదని, క్రమశిక్షణతో అభ్యసించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం-2024,జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (నల్సా) వారి మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు, మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవల పథకం-2024 గురించి వివరించారు.లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయము, మొదలు అంశాలపై అవగాహన కలిగించారు.ఏవైనా సమస్యలుంటే కడపలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుక రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా నిలయం హెడ్మాస్టర్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ’ సమావేశం

వల్లూరు (చెన్నూరు) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలు విస్మరించడంపై బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీలో భాగంగా రీకాల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు చెన్నూరు మైనార్టీ కాలనీలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విజయవంతం చేయాలి

కమలాపురం : మండల పరిధిలోని పి. వెంకటాపురం గ్రామంలో మంగళవారం 8 గంటలకు బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని ఆయన అందులో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

వేంపల్లె : జీఓ నెంబర్ 1214ను రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహశీల్దార్ హరినాథ్ రెడ్డికి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా రామాంజనేయులు మాట్లాడుతూ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లేములను పరిష్కరించి నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా 1996 చట్టం అమలు చేసి 12 రకాల సౌకర్యాలు అందించాలన్నారు. లేబర్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరత లేకుండా చేయాలనానరు. కొత్త గుర్తింపు కార్డులు ఇవ్వడం తోపాటు పాత వాటికి రెన్యూవల్ చేయాలని, 50ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులందరికి రూ.6వేల పింఛన్ ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం బోర్డు నుండి వాడుకున్న నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చల్లా బాలాజి, దస్తగిరి, నాగేశ్వరరావు, బుజ్జి, లక్ష్మీనారాయణ, నాగేంద్రల తోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ ప్రసాద్


జమ్మలమడుగు రూరల్ : ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ బొలిశెట్టి ప్రసాద్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని గండికోట గ్రామ సచివాలయంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్బముగా బ్యాంక్ మేనెజర్ మాట్లాడుతూ ప్రజలను మోసగించడానికి నేరగాళ్లు సిద్దంగా ఉంటారన్నారు. అటువంటి వారి భారీన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాం తమ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. తమ అధార్ కార్డ్ నెంబర్ ఓటీపీ చెప్పాలని ఫోన్ చేసినప్పడు నేరుగా బ్యాంక్ వెళ్లి సమాచారం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి తదితర పథకాలు ఉన్నాయన్నారు. కావున ఖాతాదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కోసం ప్రకృతిని కాపాడుకుందాం


మాట్లాడుతున్న కళాశాల అధ్యాపకుడు శ్రీకాంత్‌రెడ్డి

వేంపల్లె : మన భవిష్యత్ కోసం ప్రకృతిని కాపాడుకుందామని కళాశాల అధ్యాపకుడు డాక్ట్ర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేంపల్లెలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి ప్రకృతి పరిరక్షణను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం అధ్యాపకురాలు మల్లేశ్వరమ్మ విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగలక్ష్మీదేవి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధి, సాయం పొందినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : లబ్ధి, సహాయం పొందినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఘాటుగా విమర్శించారు. సోమవారం పట్టణంలోని వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా ప్రెస్‌మీట్ పెట్టి కొన్ని ప్రశ్నలు వేశారని, ముద్దనూరు ఆర్‌అండ్‌బీలో ఆదినారాయణరెడ్డిని కలిసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారన్నారు. 2016లో వడ్డెర సంఘం ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు వడ్డెరులందరికీ లోన్లు ఇప్పించాలనే ఉద్దేశంతో టీడీపీ తొండూరు నాయకుడు మల్లికార్జునరెడ్డి లోన్లు ఇప్పిస్తానని తనను తీసుకెళ్లింది వాస్తవమన్నారు. తాను ఆదినారాయణరెడ్డితో మాట్లాడింది వాస్తవం, లోన్లు ఇప్పిస్తామని చెప్పింది వాస్తవం, కానీ ఒక్కరూపాయి కూడా ఆయన వడ్డెరులకు లోన్లు ఇప్పించిన దాఖలాలు లేవన్నారు. ఆదినారాయణరెడ్డి పార్టీలోకి రమ్మన్నది వాస్తవం, నేను రానని చెప్పడం వాస్తవం, దీనంతటికి కారణం మల్లికార్జునరెడ్డి అన్నారు. తెలుగుదేశంలో పార్టీలో ఉన్న ఒకే ఒక స్నేహితుడు తొండూరు మల్లికార్జునరెడ్డి, ప్రతి ఒక్క దానికి ఆయనే సాక్షమన్నారు. బీటెక్ రవి మీ బంధువుల ఆరోగ్యం బాగలేకపోతే తెలుగుదేశం పార్టీ నాయకులకు కలిసి ఏదోకటి సహాయం చేయాలని అడగడం వాస్తవమా, కాదా అని నన్ను అడగడం జరిగిందన్నారు. ఇది అవాస్తవం, మీరు నిరూపిస్తే నేను దేనికైనా సిద్ధమన్నారు. మా బంధువులెవరికి గానీ మీ నుంచి నేను సహాయం కోరడమనేది శుద్ధ అబద్ధమన్నారు. మీకు చేతనైతే నేను ఎవరిని అడగానో ఏమి చేశారో మీరు నిరూపిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. బీటెక్ రవి స్థానిక సంస్థల ఎన్నికలలో వివేకానంద రెడ్డిని ఓడించాలని చెప్పినా.. నేను ఓటు వేసింది వివేకానందరెడ్డికే అన్నారు. దీనిపై ఎక్కడ ప్రమాణం చేయమన్న కూడా చేస్తానన్నారు. నేను వైఎస్ కుటుంబీకులకు, వాళ్లందరికి కూడా ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశానన్నారు. ఇప్పటి వరకు నేను దాదాపు 18 కేసులపై కోర్టు మెట్లు ఎక్కి దిగినానని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి నమ్మకంగా పని చేస్తున్నారని, అందుకే తనపై టీడీపీ 18 కేసులు పెట్టించిందన్నారు. ఏ రోజు నేను భయపడలేదని, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డానని పేర్కొన్నారు. నేను ఒక్కటే సవాల్ విసురుతున్నానన్నారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రాంగోపాల్‌రెడ్డిని ఓడించడానికి ఎవరూ ఎన్ని కుతంత్రాలు పెట్టినారో, రాంగోపాల్‌రెడ్డిని గెలిపించడానికి ఎవరూ ఎన్ని ఉపాయాలు పన్నారో నాకు తెలుసు అన్నారు. నేను సమయం, సందర్భం వచ్చినప్పుడు మీ నాయకుల హిస్టరీ మొత్తం బయటపెడతానన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి తనకు ఇచ్చే విలువ ఏమిటో తనకు తెలుసు అని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలలో ఎవరెవరూ కోవర్టులుగా పనిచేశారో, నాతో ఎవరూ మాట్లాడారో నేను కచ్చితంగా బయటపెడతా ఖబడ్దార్ అని హెచ్చరించారు. నిన్న కాక మొన్న కేసు పెట్టినప్పుడు నాకు చెప్పి పంపడం వాస్తవం కాదా అని అడుగుతున్నా. ముందు ఒకసారి కోటి రూపాయలు మీ ఇంటికి తెచ్చిస్తామన్నది వాస్తవం, తర్వాత రూ.2 కోట్లు ఇస్తాం పార్టీ మారమని చెప్పడం వాస్తవం, రూ.20 కోట్ల వర్క్ ఇస్తామని చెప్పడం వాస్తవం, ఒక గన్‌మెన్ ఇస్తామని చెప్పడం వాస్తవమన్నారు. నేను, నా భార్య ఇద్దరం కూడా ఇవన్నీ చర్చించుకుని ఇన్ని సంవత్సరాలు కష్టపడి పనిచేశాం, ఈ 2కోట్లతో మనకు ఒరిగేది లేదు, మనం ఎప్పుడు కూడా జగన్‌రెడ్డి వెంట, అవినాష్‌రెడ్డి వెంట ఉంటామని మేమిద్దరం అనుకున్నది వాస్తవమన్నారు. మీకు పబ్లిక్‌గా నేను సవాల్ విసురుతున్నా మీ నాయకులతో ఒక్క రూపాయి కానీ, ఒక్క మాట సహాయం కానీ నేను లబ్ధి పొందింటే పూలంగళ్ల సెంటర్‌లో నన్ను ఉరితీయమని నేను అడుగుతున్నా.. మీకు ఇది మంచి చాన్స్ అని, నన్ను రాజకీయాల నుంచి తప్పించడానికి ఒక మంచి చాన్స్ దొరుకుంది, దీన్ని ఉపయోగించుకోవాలన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

వల్లూరు (చెన్నూరు) : ప్రభుత్వంపై ఉద్యోగులు, పెన్షన్లు ఎంతో ఆశ పెట్టుకుంటే.. కూటమి ప్రభుత్వ చేసింది గోరంత అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ గంగన్నలు ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్సీ, డీఏ బకాయిలు, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ 2022 నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని చెల్లించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ లాంటి ఆర్థిక బకాయిల చెల్లింపులు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం వేసిన పీఆర్సీ కమిటీ చైర్మన్ రాజీనామా చేయడంతో పీఆర్సీ కమిటీ రద్దు చేశారన్నారు. ఈ ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేయకపోవడం, ఐఆర్ ప్రకటించకపోవడం తగదన్నారు.

నిరాశ్రయులకు పునరావాసం కల్పిస్తాం

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో నిరాశ్రయులకు పునరావాసం కల్పించే విధంగా పట్టణంలోని వాసవీ కాలనీ సమీపంలో నిరాశ్రయుల ఆశ్రమం ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు శ్రీలక్ష్మీ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలో మూడు రోజుల క్రితం పాత బస్టాండ్ దగ్గర రాజు కళ్లు కనిపించకుండా ఉండటంతో స్థానికులు నిరాశ్రయుల ఆశ్రమానికి సమాచారం అందించారన్నారు. దీంతో సిబ్బందితో వెళ్లి ఆకలిగా ఉన్న రాజును ఆశ్రమానికి తరలించి భోజనం పెట్టి వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. రాజుకు సంబంధించిన వ్యక్తులు వస్తే నిరాశ్రయుల ఆశ్రమంలో ఉంటున్నాడని, వారి బంధువులు వచ్చి తీసుకెళ్లొచ్చునన్నారు. అంత వరకు ఆశ్రమంలోనే రాజుకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

జమ్మలమడుగు రూరల్ : మండలపరిధిలోని అంబవరం గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి పంచమ వార్షిక వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పురోహితులు కళ్యాణ్ శర్మ స్వామి వారిని ప్రత్యేకముగా అలకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్బముగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వమించారు. అనంతరము వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ఇంటింటా ప్రచారం

చింతకొమ్మదిన్నె : మండలం నుంచి కడప నగరం 45 వ డివిజన్లోకి విలీనమైన ఊటుకూరు ప్రాంతంలో ఈ నెల 30 వతేదీన సాయంత్రం 4 గంటలకు ఇంటింటికి తిరిగి చంద్రబాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ పార్టీ కమలాపురం ఇన్‌ఛార్జి నరేన్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు 45వ డివిజన్ కార్పొరేటర్, కమలాపురం వైఎస్సార్ సీపీ ఆర్గనైసింగ్ కార్యదర్శి గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొంటారని, చింతకొమ్మదిన్నె మండలంలోని పార్టీ నాయకులు,కార్పొరేటర్లు,పార్టీ తరపున గెలిచిన ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీనివాసులురెడ్డి కోరారు.

ప్రారంభమైన భాగవత సప్తాహం

లింగాల : మండల కేంద్రమైన లింగాల రామాలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భాగవత సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. భాగవత సమాజ సభ్యులు భాగవత పారాయణం గావిస్తూ భాగవత పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెద్దకుడాల, తేర్నాంపల్లె, అక్కులగారిపల్లె గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టత గురించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందు జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు వరుణ్ కుమార్, సభ్యులు మహేశ్వరరెడ్డి, గురుమూర్తి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ ఏరియా కార్యదర్శి వెంకటరాములు

తొండూరు : స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయకపోతే మరో బషీర్‌బాగ్ పోరాటం తప్పదని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట్రాములు పేర్కొన్నారు. సోమవారం తొండూరులో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో అంబానీ, ఆదానిల అక్రమార్జనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ వైఖరి ప్రజా వ్యతిరేక విధానం అవలంభిస్తోందన్నారు. అధికారంలో లేనప్పుడు గత ప్రభుత్వంపైన చంద్రబాబు, లోకేష్ స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టాలని పిలుపునిచ్చి ప్రస్తుతం మోడీ ప్రభుత్వానికి, అంబానీ, అదానిలకు లొంగిపోయి రాజకీయ అవసరాల కోసం ప్రజలపైన కోట్ల రూపాయల భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ 13నెలల్లోనే విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపైన దాదాపు రూ.15,426 కోట్ల భారాన్ని మోపిందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోకపోతే వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పులివెందుల ఏరియా నాయకులు ఈశ్వరయ్య, అమీర్ పాల్గొన్నారు.